క్లుప్తంగా

పాడిరైతులను ఆర్థికంగా ఆదుకోవాలి



సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు

తాళ్లపూడి: గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో మృతి చెందిన గేదెల యజమానులకు నష్టపరిహారం అందజేయాలని వైఎస్సార్ సీపీ మాజీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణలకు పాడి రైతులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన సింగూఖూరి శివగంగాధర్, చల్లా వీర వెంకట సత్యనారాయణ, బెల్లంకొండ సోమన్న, రమణ తదితరులు మాట్లాడుతూ కొన్ని గేదెలను వ్యాధి సోకగానే కబేలాకు ఇచ్చేసారని, మరికొంత మంది చనిపోయిన తరువాత కబేలాకు ఇస్తామన్నారని తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని, తమకు పాడే జీవనాధారమని వాపోయారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి గేదెలను కాపాడాలని, డాక్టర్లు వచ్చి వ్యాధి నిర్ధారణ చేయ్యలేదని, స్థానిక ఎమ్మెల్యే తమ గ్రామాన్ని కనీసం సందర్శించలేదని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిడదవోలు ఏఈఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నిడదవోలు: తమ న్యాయమైన డిమాండ్‌లను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఏపీ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు నిడదవోలు డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ మేరకు విద్యుత్ ఏఈఈ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ప్రభుత్వం తమ డిమాండ్‌లను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ చైర్మన్ గంటా సత్యనారాయణ, కన్వీనర్ నాయుడు చంద్రరావు, కార్యదర్శి శ్రీవాసుదాసు, అబ్రహం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలు అందరికీ అందాలి



ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌కు కరపత్రం అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

పెరవలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన వివిధ ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ వైద్యులకు సూచించారు. మండలంలోని ఖండవల్లి రవళీ స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో మంగళవారం కానూరు, పెరవలి పీహెచ్‌సీ వైద్యుల సిబ్బంది ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు చేపట్టే ప్రత్యేక కార్యక్రమం 'స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్' పథకం ఆవశ్యకతను వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఆర్ఎస్ఎస్‌వి ప్రసాద్, హేమరాజు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరాలు

చాగల్లు: కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, చాగల్లు నెలటూరు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17 వ తేది నుంచి అక్టోబరు 2 తేది వరకు చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.వెంకటరామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, వివిధ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని ఆయా విభాగాల్లోని ప్రముఖ వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని చెప్పారు. కావున పరిసర ప్రాంతాల మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల ఆరోగ్యంతోనే అభివృద్ధి

నల్లజర్ల: కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా నేటి నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మంగళవారం తెలిపారు. నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీల పరిధిలో శిశువుల నుంచి వృద్ధుల వరకు రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, క్షయ, రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారన్నారు. అవసరం మేరకు ఉన్నత వైద్యశాలలకు రిఫర్ చేస్తారన్నారు. వివిధ ఆసుపత్రుల వైద్యాధికారులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

సమస్యలపై గళమెత్తిన సభ్యులు

- వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం
- పుష్కరాలకు రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి
- వివిధ సమస్యలపై చర్చించిన సభ్యులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ తిరుమలరావు

చాగల్లు: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు చిక్కాలపాలెం ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు మాట్లాడుతూ చిక్కాలపాలెం, చిక్కాల మీదుగా గ్రామ ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కో-ఆప్షన్ సభ్యుడు సర్దార్ పాషా మాట్లాడుతూ చాగల్లులో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని చర్యలు తీసుకోవాలని కోరారు. షుగర్ ఫ్యాక్టరీ బ్రాందీ షాపు వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. చంద్రవరం గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి కోరారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ త్రిమూర్తులు కోరారు.

పుష్కరాల నాటికి అభివృద్ధి

నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైనేజీలను పుష్కరాల సందర్భంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో రేషన్ కార్డుదారులకు కొత్త రైసు కార్డులు పంపిణీ చేశామని ఎవరైనా స్మార్టు కార్డు తీసుకోకపోతే ఆయా గ్రామాల్లో రేషన్ డీలర్లను సంప్రదించాలని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.సునీత సూచించారు. కార్డుల్లో తప్పులుంటే గ్రామ సచివాలయంలో అర్జీ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమావేశాలు తూతూ మంత్రంగా కాకుండా ప్రజా సమస్యలపై చర్చ జరిగి వాటి పరిష్కారానికి వేదిక కావాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, ఎంపీటీసీలు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉసురుమర్తి జ్యోతి, ఉన్నమట్ల విజయకుమారి, ఇంటి కృష్ణవేణి, తాళ్లూరి రమ్య, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్ముడు, కుదప రాంబాబు, ఉన్నమట్ల మనశ్శాంతి, కొయ్యే మణి, గురువేల్లి కుమారి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరోసారి నమ్మి మోసపోవద్దు

- చంద్రబాబు పాలన ఓ మాయాజాలం
- మరోసారి జగన్‌ను ఆశీర్వదించాలి



తాళ్లపూడిలో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి: అబద్ధపు హామీలు ఇచ్చి అమలు చేయని చంద్రబాబును మరోసారి నమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని విశ్వసనీయత కలిగిన జగన్‌ను ఆశీర్వదించాలని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. మండల కేంద్రం తాళ్లపూడిలో మంగళవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' గ్రామస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, గ్రామంలో రచ్చబండ నిర్వహించి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. సమావేశంలో తలారి వెంకట్రావు మాట్లాడుతూ చేయ్యని పనులను చేసినట్టు రాజమౌళి సినిమా సెట్టింగ్‌లా గ్రాఫిక్స్‌లో చూపించడం చంద్రబాబుకు అవలాటేనన్నారు. నిరుద్యోగులకు ఏటా వేలాది ఉద్యోగాలు ఇస్తానని చెప్పి, కనీసం ఇప్పటి వరకు నిరుద్యోగులకు భృతి ఇస్తానని చెప్పిన బాబు కనీసం అదైనా ఇచ్చాడా లేదు కాదా..ఇది మోసం కాదా బాబు అని ప్రశ్నించారు. అమ్మ ఒడి ద్వారా తమ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో 87 లక్షల మందికి అమ్మ ఒడి నగదును అందిచారన్నారు. కానీ కూటమిలో 67 లక్షల మందికే ఇచ్చారని ఇది మోసం కాదా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, పార్టీ జిల్లా ఉపాధ్యకుడు కాకర్ల వెంకటేశ్వరావు, జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యులు వంబోలు పోసిబాబు, గూడా విజయరాజు, యాళ్ల బాబురావు, పిట్టా శ్రీనివాస్, పరిమి సోమరాజు, సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశు రామారావు, గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, గ్రామకమిటీ అధ్యక్షుడు వనిమిరెడ్డి శ్రీను, ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, సిద్ధం శెట్టి కృష్ణ, కొసన శివ, చిట్టూరి అన్నవరం, కవల నాగేశ్వరావు, బండ్రెడ్డి సత్యనారాయణ, గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజానికి మార్గదర్శకులు గురువులు



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

తాళ్లపూడి: మండల పరిధిలోని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉద్యోగులను ఎం.రాజకుమారి, ఎస్‌వీ రామ్మోహనరావు, పి.శ్రీనివాసరావులను మంగళవారం మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉంటుందన్నారు. మండల శాఖ అధ్యక్షుడు బి.శంకర్ మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోకి ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని, మనిషి ఎదుగుదలను నుదుటన రాసేది ఉపాధ్యాయుడేనన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.విజయబాబు మాట్లాడుతూ గురువు క్షేత్రమైతే శిష్యుడు విత్తనం లాంటివాడని, రెండింటి మేలు కలయిక వల్లే జ్ఞానమనే బంగారు పంట పండుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.రవి, మండల ప్రధాన కార్యదర్శి టి.క్రాంతికుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సీఎచ్. శ్రీనివాస్, ట్రెజరర్ టి.వెంకటరమణ, జె.లక్ష్మీపతి, మహిళా ఉపాధ్యక్షురాలు కె. కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాల, బాలికల జట్లు

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా మైదానంలో సెపక్‌తక్రా తూర్పు గోదావరి మహిళా, పురుషుల సీనియర్ జట్ల ఎంపిక పోటీలు మంగళవారం జరిగాయి. పోటీల్లో ఎంపికైన ఇరు జట్లు ఈ నెల 26న ఒంగోలులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, పీడీ టి.సరస్వతి తెలిపారు. పురుషుల జట్టుకు ఎల్.గణపతి, సీహెచ్ సతీష్, పి.సాయి, కె.పవన్ కుమార్, టి.ఎస్.వంశీ, బి.రవితేజ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. మహిళల జట్టుకు బి.దుర్గా మాధురిశ్రీ, ఎం.మహలక్ష్మి, టి.నవ్యశ్రీ, కె.వర్షిణి, కె.సుభాషిణి, కె.లలిత సుధాసాహి ఎంపికైనట్టు ఆయన వెల్లడించారు.

రక్షణ కవచాన్ని కాపాడుకోవాలి



ఓ3 ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

తాళ్లపూడి: సూర్యుడి నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపై పడకుండా అందులో ఉండే అతినీలలోహిత వికిరణాలను ఓజోన్ పొర సంగ్రహించి ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుందని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఓ3 ఆకారంలో ప్రదర్శన నిర్వహించి ఓజోన్ పొర ఆవశ్యకతను వివరించారు.

- పైడిమెట్టలోని మండల పరిషత్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓజోన్ పొరను పరిరక్షించండి అంటూ గొడుగులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు ఓజోన్ పొర పరిరక్షణ, దాని ఆవశ్యకతను విద్యార్థులకు వివరిస్తు ఓజోన్ పొరను దెబ్బతీస్తున్న పదార్థాల నియంత్రణకు అందరూ మొక్కలు పెంచాలన్నారు.

ఓజోన్ పొరను రక్షించుకుందాం

గోపాలపురం: ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సేవ్ ఓజోన్ అంటూ నినాదాలు చేశారు. కాలుష్యం పెరిగిపోవడంతో ఓజోన్ పొరకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఓజోన్ పొర క్షీణిస్తే అతి లోహిత కిరణాల వల్ల మావన జాతి మనుగడ కోల్పోతుందన్నారు.

మాయ మాటలు నమ్మి మోసపోవద్దు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం కార్యదర్శి బాలశ్రీ

గోపాలపురం: యుక్త వయస్సులో బాలికలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యువకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని కొవ్వూరు శక్తి జోన్ శక్తి టీం కార్యదర్శి కె.బాలశ్రీ అన్నారు. స్థానిక బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో కేసులు, 112 ఫోన్ నంబర్ వివరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి బాలశ్రీ మాట్లాడుతూ బాలికలు ఏ సందర్భంలోనైనా అవమానానికి గురైనా, ఎటువంటి వేధింపులకు పాల్పడినా అటువంటి ఆకతాయిల సమాచారాన్ని తల్లిదండ్రులకు, పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ స్టాలిన్, ప్రిన్సిపాల్ నాగ తోట సుజినీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

నిడదవోలు: కూటమి ప్రభుత్వం వైద్య కాలేజీలను ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు బయ్యే మునీంద్ర మాట్లాడుతూ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పీపీపీ మోడల్‌లో నిర్మాణం చేసే నిమిత్తం కేబినెట్ తీర్మానం చేసి ప్రభుత్వం తమ బాధ్యతలు నుంచి తప్పుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భూములు ఉచితంగా ఇవ్వడానికి యత్నిస్తోందన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల పేద మెడికల్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రభుత్వం వెంటనే కేబినెట్ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబటి పుల్లారావు, తాడేపల్లి రాజన్‌బాబు, నేలపూరి రత్నాజీ, ఎలిపే వెంకట్రావు, తలారి బాబు, యేసు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనకు కృషి చేయాలి



అచ్చన్నపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సోమశేఖరం

నల్లజర్ల: రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ కొవ్వూరు డివిజన్ ఏడీఏ చింతల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం అచ్చన్నపాలెంలో ఎరమందును ఏవిధంగా వినియోగించాలనే విషయంపై ఏఓ సోమశేఖరం రైతులకు అవగాహన కల్గించారు. వ్యవసాయ సహాయకులందరికీ ముందుగా శిక్షణ ఇచ్చి 19 రైతుసేవా కేంద్రాల్లో ఎరమందు అందుబాటులో ఉంచామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్రోమోడైన్ మందును నూకలు, మంచినూనె కలిపి రైతులంతా ఒకేసారి తెరిచి ఉన్న కన్నాలలో మందును ఉంచడం ద్వారా ఎలుకలను నిర్మూలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పుష్పలత, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు



తహసీల్దార్, ఎంపీడీఓ సమక్షంలో విచారణ చేస్తున్న అధికారులు

పెరవలి: స్థలంలోని దారి విషయంలో ఇరువర్గాల మధ్య గత కొంత కాలంగా ఫిర్యాదులు పరంపర కొనసాగుతుండగా విచారణ చేస్తున్న అధికారుల ముందే ఇరు వర్గాలు కేకలు వేసుకోవటంతో అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఉద్దేశంతో పోలీస్ స్టేషన్‌లో సెక్రటరీ, వీఆర్‌ఓ ఫిర్యాదు చేశారు. మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో దారి కోసం మండల లేవెల్ కమిటీలో ఫిర్యాదు చేయటంతో సమస్య పరిష్కారానికి తహసీల్దార్ కె. నిరంజన్, ఎంపీడీఓ పద్మజ కలసి మంగళవారం మధ్యాహ్నం విచారణ చేపట్టారు. వాదనలు విని, దస్తావేజులు పరిశీలిస్తుండగా ఇరువర్గాలు వారు కేకలు వేసుకోవటంతో సమావేశం రసాభాసాగా మారింది. దీనితో తహసీల్దార్, ఎంపీడీఓలు ఇద్దరు బయటకు వచ్చి ఇరు వర్గాలు కలిసి విచారణ చేస్తుండగా విధులకు ఆటంకం కలిగించారని సెక్రటరీ, వీఆర్‌ఓలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. దీనిపై తహసీల్దార్ కె.నిరంజన్‌ను వివరణ కోరగా విచారణలో తమ విధులకు ఆటంకం కలిగించి, దుర్భషలాడారని దీనిపై సెక్రటరీ, వీఆర్‌ఓను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని ఆదేశించినట్లు ఆయన వివరించారు.

సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

నిడదవోలు: నిడదవోలు మున్సిపాటిటీలో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు జోసెఫ్ కిషోర్ ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించారు. పట్టణ వార్డు సచివాలయ ఉద్యోగుల నూతన అధ్యక్షుడిగా ఎస్. సుబ్బారావు, ఉపాధ్యక్షుడు డి.సన్నీ ప్రదీప్, సంయుక్త కార్యదర్శి డి. ఫణికుమార్, ఎగ్జిక్యూట్ ప్రెసిడెంట్‌గా టి.రమ్యశ్రీ, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.శ్రావణ, డి.మనీష, ఎస్‌కే సుల్తానాబేగంలతో పాటు సభ్యులుగా సుమలత, వెంకటరావు, అమీర్ ఖాన్, మంగతయారు, సూర్యరావు, యామిని, చంటి, రవికుమార్, లక్ష్మణరావు, తాతారావు, శ్రీవిద్యలు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఖజానా అధికారి టి.దుర్గ ప్రసాద్, రాష్ట్ర ఎగ్జిక్యూట్ అధ్యక్షుడు వి.జీవన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

నిడదవోలు: పట్టణంలో నెహ్రూనగర్‌లోని 1,470 కేఎల్ సామర్థ్యం గల మంచినీటి రిజర్వాయర్‌కు అత్యవసర మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా ఈ నెల 18 తేది నుంచి 21వ తేదీ వరకు తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 3వ వార్డు, 11, 13, 16, 21, 26 వ వార్డులకు తాగునీరు సరఫరా తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆయా వార్డుల్లో మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు.

మాజీ హోంమంత్రి పరామర్శ



బంగారయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న తానేటి వనిత

గోపాలపురం: మాజీ హోంమంత్రి తానేటి వనిత వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్న బూరెడ్డి సత్యనారాయణ తండ్రి బంగారయ్య మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు సమాచారాన్ని అందుకున్న తానేటి వనిత బంగారయ్య పార్థివ మృతదేహనికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, సాలి వేణు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, వింత ప్రసాద్‌రెడ్డి, కాళ్ల శేషగిరిరావు ఉన్నారు.

ఎంఈవోల బదిలీలు చేపట్టాలి

కంబాలచెరువు: గత ఎనిమిదిన్నరేళ్లగా మండల విద్యాశాఖాధికారుల బదిలీలు లేకపోవడంతో విద్యాశాఖలో తీవ్ర వైరాస్యం నెలకొందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి వీవీ శాస్త్రి అన్నారు. నగరంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో ఆపస్ సభ్యత్వ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో పని చేస్తున్న ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు 22 ఏళ్లగా ఒకే ప్రాంతంలో ఉండిపోయారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితి కూడా ఇదేనన్నారు. వీరందరికి మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్)య మంజూరు చేసి బదిలీలు చేబట్టాలన్నారు.